ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

రాజంపేట్, ఫిబ్రవరి 3: ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. మండలంలోని లేతమామిడి తండా నుంచి ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు సోమవారం తెల్లవారుజామున కాపలా ఉండి, ట్రాక్టర్‌తోపాటు నడిమితండాకు చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ట్రాక్టర్‌ను పట్టుకున్న హెడ్‌కానిస్టేబుల్ రమేశ్, కానిస్టేబుళ్లు సురేశ్, చరణ్‌ను ఎస్సై అభినందించారు.

జాతీయ స్థాయిలో జిల్లావాసి ప్రతిభ

సిల్వర్ మెడల్ సాధించిన సునీల్‌రెడ్డి

కామారెడ్డి, ఫిబ్రవరి 3: కేరళరాష్ట్రంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి 800 మీటర్లు, ఐదు వేల మీటర్ల పరుగుపందెంలో జిల్లావాసి సునీల్‌రెడ్డి సత్తా చాటాడు. సిల్వర్ మెడల్‌ను సాధించాడు. దీంతో అతడిని మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రంజిత్ మోహన్, గౌరవ అధ్యక్షుడు రాజన్న, ప్రధాన కార్యదర్శి నరేశ్, వైస్ ప్రెసిడెంట్ సునీల్ అభినందించారు.

కాచాపూర్‌లో వైద్య శిబిరం

మందులు అందజేస్తున్న మాజీ ఎంపీపీలు గాల్‌రెడ్డి, సుదర్శన్

భిక్కనూరు, ఫిబ్రవరి 3: మండలంలోని కాచాపూర్ గ్రామంలో హైదరాబాద్‌లోని మల్లారెడ్డి, నారాయణ మల్టీ స్పెషాలిటీ దవాఖాన ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల వైద్య నిపుణులు గ్రామస్తులను పరీక్షించారు. అవసరం ఉన్న వారికి ఈనెల 5వ తేదీన ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీపీలు గాల్‌రెడ్డి, సుదర్శన్ తెలిపారు.

వేతనాలు చెల్లించాలని సబ్ కలెక్టర్‌కు వినతి

బాన్సువాడ, ఫిబ్రవరి 3: బాన్సువాడ ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తున్న సిబ్బందికి నాలుగు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ డివిజన్ కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి సోమవారం వినతిపత్రం అందజేశారు. బాన్సువాడ ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్‌కేర్ తదితర విభాగాల కార్మికులకు రావాల్సిన నాలుగు నెలల వేతనాలు చెల్లించాలని కోరారు. విధుల నుంచి తొలగించిన సిబ్బందిని వెంటనే తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, ఫిబ్రవరి 3: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి, బాధితులకు వెంటనే పరిష్కారం చూపాలన్నారు. భూ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను రెవెన్యూ శాఖ అధికారులు పరిష్కరించాలన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 80 వినతులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో మన్నె ప్రభాకర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు

గ్రామాల్లో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించాలి

రాజంపేట్, ఫిబ్రవరి 3: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున గ్రామాల్లో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మండల అధికారులకు ఆదేశించారు. రాజంపేట తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రం నుంచి వారికి కలెక్టర్ పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీవో రఘురాం, ఏవో శృతి, ఏపీఎం సాయిలు, ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ శరత్ కుమార్, మిషన్ భగీరథ ఏఈ రజిత, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహార లోపం నివారణ పై అవగాహన

అవగాహన కల్పిస్తున్న అధికారులు

మాచారెడ్డి, ఫిబ్రవరి 3: మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో వీవోఏలు, సీసీలతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్ఐఆర్‌డీపీఆర్, యూనిసెఫ్, సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో పిల్లల్లో పోషకాహార లోపం నివారించడంపై అవగాహన కల్పించారు. డీఆర్డీవో మురళి, డీపీఎం సాయిలు మాట్లాడుతూ.. ఐదేళ్లలోపు పిల్లల్లో పోషకాహార లోపంతో శారీరక పెరుగుదల, మానసిక వికాసం బలహీనపడుతుందని చెప్పారు. వాటిని నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమావేశంలో ఏపీఎం శ్రీనివాస్, స్వయం సహాయక సంఘాల సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వదేశీ మేళా పోస్టర్ల ఆవిష్కరణ

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, ఫిబ్రవరి 3 : కరీంనగర్ స్వదేశీ జాగరణ మంచ్ తెలంగాణ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ నుంచి కామారెడ్డిలో నిర్వహించనున్న స్వదేశీ మేళా పోస్టర్లను స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి రమణారెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేళా ను 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మేళాలో స్వదేశీ ఉత్పత్తులను ప్రదర్శించడంతో భారతీయ సంస్కృతి, స్వదేశీ పరిజ్ఞానం, కళా సంస్కృతులపై అవగాహన ఏర్పడుతుందన్నారు. స్వదేశీ జాగరణ మంచ్ ఇందూర్ విభాగ్ కో-కన్వీనర్ బొర్ర రాజాగౌడ్, జిల్లా కన్వీనర్ వంగ రాహుల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, నాయకులు రంజిత్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగు నీటి సమస్య లేకుండా చూడాలి

తాడ్కోల్ గ్రామంలో వాటర్ ట్యాంకు పరిసరాలను పరిశీలిస్తున్న బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్, అధికారులు

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 3: వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామంలో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బషీరుద్దీన్ మిషన్ భగీరథ ఏఈ శ్రీకాంత్‌కు సూచించారు. బాన్సువాడ మండలంలోని తాడ్కోల్ గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంకులు, నీటి కులాయిలు, తాగు నీటి సరఫరా తదితర వివరాలను గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి, ఏఈని అడిగి తెలుసుకున్నారు. ఎండాకాలంలో గ్రామంలో తాగు నీరు సమస్య లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఎంపీవో సత్యనారాయణరెడ్డి, కారోబార్ హన్మాండ్లు తదితరులు ఉన్నారు.

ముత్యంపేటలో పారిశుద్ధ్య పనులు

నీటితొట్టిని శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికుడు

బీబీపేట్ (దోమకొండ), ఫిబ్రవరి 3: దోమకొండ మండలంలోని ముత్యంపేట గ్రామంలో అపరిశుభ్రతపై 'నమస్తే తెలంగాణ'లో ఆదివారం 'పడకేసిన పారిశుద్ధ్యం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. డీఎల్పీవో శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఎంపీడీవో ప్రవీణ్ సూచనల ప్రకారం.. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న మురికి కాలువలు, నీటి తొట్టిలో పెరిగిన నాచును కార్యదర్శి అంజయ్య సోమవారం శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

తమిళ నాడులో మాచారెడ్డి స్కౌట్స్ ప్రదర్శన

మాచారెడ్డి, ఫిబ్రవరి 3: మండలంలోని మాచారెడ్డి, ఘన్‌పూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నేషనల్ క్వార్టర్ ఢిల్లీ ఆధ్వర్యంలో తమిళనాడులో జరిగిన డైమండ్ జూబ్లీ జంబోరీలో పాల్గొన్నారు. జనవరి 27 నుంచి ఈనెల 3వ తేదీ వరకు నిర్వహించిన ప్రదర్శనల్లో బతుకమ్మ, బోనాలు, పోతురాజు, రాణిరుద్రమ్మ, సమ్మక్క సారక్క వేషాధారణలతో అలరించారు. ఈ ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థులను మాచారెడ్డి ఎంఈవో దేవేందర్‌రావు, హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. జిల్లా ఎస్కార్ట్‌గా గోపాల కృష్ణ, సంధ్య ఉన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నీలం చిన్నరాజులు

కామారెడ్డి, ఫిబ్రవరి 3 : భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నీలం చిన్న రాజులు నియమితులయ్యారు. దేవునిపల్లి గ్రామానికి చెందిన చిన్న రాజులు న్యాయవాదిగా పనిచేస్తూ ఇదివరకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమ్మకంతో జిల్లా బాధ్యతలను అప్పగించిన పార్టీ రాష్ట్ర, జిల్లా బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

'చలో హైదరాబాద్' పోస్టర్ల ఆవిష్కరణ

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 3: హైదరాబాద్‌లో ఈనెల 7వ తేదీన నిర్వహించనున్న లక్ష డప్పులు.. వేయి గొంతులు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను నస్రుల్లాబాద్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హన్మాండ్లు, సాయిలు, గంగారాం, మోహన్, గంగాధర్, సాయిలు, రవి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్

కలెక్టర్ అశీష్ సంగ్వాన్‌కు మొక్కను అందజేస్తున్న మహేశ్‌కుమార్

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 3: కలెక్టర్ అశీష్ సంగ్వాన్‌ను ఎల్లారెడ్డి మున్సిపల్ నూతన కమిషనర్‌గా విధుల్లో చేరిన మహేశ్‌కుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆయనను కలిసి మొక్కను బహూకరించారు.

చదువుతోనే సమాజంలో గౌరవం

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 3: చదువుతోనే భవిష్యత్తు అని అడ్విలింగాల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివనరసింహారావు అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణంలోని ఎస్సీ బాలికల వసతిగృహంలో విద్యార్థినులతో ఆయన మాట్లాడారు. వారికి చదువు ప్రాధాన్యతను వివరించారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు అని, చదువుకుంటేనే సమాజంలో గౌరవం పెరుగుతుందని విద్యార్థులకు సూచించారు.

ఎల్లారెడ్డి ఎస్సీ బాలికల వసతిగృహంలో మాట్లాడుతున్న అడ్విలింగాల్ ప్రధానోపాధ్యాయుడు శివనరసింహారావు

నీటి సమస్య గుర్తింపు సర్వే తనిఖీ

మాటూర్‌లో నీటి ఎద్దడిపై విచారిస్తున్న ఎంపీడీవో ప్రభాకర్

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 3: మండలంలోని ఆత్మకూర్, చిన్న ఆత్మకూర్, మాటూర్ గ్రామాల్లో నీటి సమస్యపై చేపడుతున్న సర్వేను ఎంపీడీవో ప్రభాకర్ సోమవారం తనిఖీ చేశారు. గ్రామంలో ప్రతి కాలనీలో తిరుగు తూ తాగునీటి ఇబ్బందులను గుర్తించి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. వేసవిని దృష్టి లో పెట్టుకొని నిశితంగా పరిశీలించాలని పేర్కొన్నారు. ఆయనవెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

మురుగు నిండింది.. కంపు కొడుతోంది

- రోగాల బారిన పడుతున్న అంగన్‌వాడీ చిన్నారులు
- మురుగు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్న తల్లిదండ్రులు

చీనూర్ ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ భవనం వద్ద ఏర్పడిన మురికి గుంత

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 3 : మండలంలోని చీనూర్ ఎస్సీ కాలనీలో మురుగునీరు నిలిచి మురికి కూపంగా మారి కాలనీవాసులకు కంపుకొడుతున్నది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఇండ్లలోని మురుగునీరు డ్రైనేజీ ద్వారా అంగన్‌వాడీ కేంద్రం భవన వెనుక భాగంలో వదిలేశారు. మురుగునీరు నిలిచి మురికి కూపంగా మారి పందులకు నిలయంగా మారింది. దీంతో దారి గుండా వెళ్లేవారు ముక్కు మూసుకోనిదే వెళ్లలేకపోతున్నారు. అంగన్‌వాడీ చిన్నారులు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి మురుగు నీరు నిల్వ కుండా చర్యలు తీసుకోవాలని, చిన్నారులు రోగాల బారిన పడకుండా కాపాడాలని కాలనీవాసులు, చిన్నారుల తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు.

నాగన్న బావిని సందర్శించిన పరమార్తదేవ్

నాగన్న బావిని సందర్శించిన యోగా గురువు రాందేవ్ బాబా శిష్యుడు పరమార్తదేవ్

లింగంపేట, ఫిబ్రవరి 3: మండల కేంద్రంలోని పురాతన కాలం నాటి నాగన్న బావిని యోగా గురువు రాందేవ్‌బాబా శిష్యుడు పరమార్తదేవ్ సోమవారం సందర్శించారు. వసంత పంచమి సందర్భంగా మండల కేంద్రంలోని శిశుమందిర్ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొని చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం నాగన్న బావిని సందర్శించగా స్థానికులు బావి చరిత్రను ఆయనకు వివరించారు. బావి కట్టడం అద్భుతంగా ఉన్నదని అన్నారు. స్థానికులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో శిశుమందిర్ మాతాజీలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలి

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 3: పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలల్లో విద్యార్థులను చదవించాలని ఎస్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అమర్‌సింగ్ అన్నారు. మండలంలోని పోచారం, మాల్తుమ్మెద, గోపాల్‌పేట్, లింగంపేట మండలం పర్శళ్ల, అయ్యపల్లి గ్రామాలతో పాటు తండాల్లో పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి తిరిగి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈనెల 6 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులకు అవకాశం ఉన్నదని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

మాల్తుమ్మెద గ్రామంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ అమర్‌సింగ్, ఉపాధ్యాయులు

'ప్రజావాణి'కి హాజరుకాని అధికారులు

ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన అధికారులు

లింగంపేట, ఫిబ్రవరి 3: తహసీల్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఆయా శాఖల అధికారులు హాజరుకావడం లేదు. ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోకపోవడంతో ఆయా శాఖల అధికారులు కార్యక్రమంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. దరఖాస్తులు రాకపోవడంతో అధికారులు సైతం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి నాయబ్ తహసీల్దార్ సంగమేశ్వర్, ఎంపీడీవో నరేశ్, ఏవో అనిల్‌కుమార్, ఏపీఎం చామంతి శ్రీనివాస్‌తో పాటు నీటి పారుదల శాఖ ఏఈ, బీసీ హాస్టల్ వార్డెన్ మాత్రమే హాజరయ్యారు. మిగిలిన శాఖల అధికారులు హాజరుకాలేదు. ప్రజావాణికి విద్యా, సాంఘిక సంక్షేమ, మిషన్ భగీరథ, ఐసీడీఎస్, పంచాయతీ రాజ్ , వైద్య, ఉపాధిహామీ పథకం, రోడ్లు భవనాలు, ఆర్టీసీ, మండల పంచాయతీ శాఖల అధికారులు హాజరుకాలేకపోయారు. హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోకపోవడ వల్లే వారు కార్యక్రమంపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజ లు పేర్కొంటున్నారు.

రంగంపేట్ రైల్వేగేటు మూడు రోజులపాటు మూసివేత

రామారెడ్డి, ఫిబ్రవరి 3 : రామారెడ్డి మండలం రంగంపేట్-కామారెడి రైల్వే గేటు 3 రోజుల పాటు మరమ్మతుల దృష్ట్యా మూసివేస్తున్నట్లు రైల్వే సెక్షన్ సీనియర్ ఇంజినీరు పి.సాయికిరణ్ సోమవారం తెలిపారు. వాహనచోదకులు ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలు సాగించి తమకు సహకరించాలని కోరారు.

ఆలయ నిర్మాణాలకు విరాళాల వెల్లువ

ఆలయానికి విరాళం అందజేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సంపత్‌గౌడ్

లింగంపేట, ఫిబ్రవరి 3: మండలంలోని రాంపల్లి స్కూల్‌తండాలో నూతనంగా నిర్మిస్తున్న జగదాంబా, సేవాలాల్ ఆలయానికి రూ.40 వేల విరాళం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎదురుగట్ల సంపత్‌గౌడ్ సోమవారం అందజేశారు. కార్యక్రమంలో గిరిజ సంఘం నాయకులు గన్నూ నాయక్, విఠల్, సక్రు, పరుశురాం, సేవ్యాతోపాటు తండావాసులు పాల్గొన్నారు.

లింగంపేట, ఫిబ్రవరి 3: మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయ నిర్మాణానికి ఆలయ కమిటీ సభ్యులు సోమవారం భూమి పూజ చేశారు. మండల కేంద్రానికి చెందిన విద్యుత్ శాఖ రిటైర్డు ఉద్యోగి తాండ్లే దశరథం ఆలయ నిర్మాణానికి రూ.లక్షా 11 వేల 111 విరా శం అందజేశారు.

శివాజీ విగ్రహ నిర్మాణానికి..

పెద్దకొడప్‌గల్, ఫిబ్రవరి 3: మండలంలోని అంజని చౌరస్తాలో నిర్మించే చత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనకు మాజీ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి రూ.50 వేల నగదు విరాళంగా అంజని గ్రామ భారతమాత యువ సేన అధ్యక్షుడు రమేశ్‌రావుకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు శ్యామ్, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'లక్ష డప్పులు .. వేల గొంతుకలు' విజయవంతం చేయాలి

ఎల్లారెడ్డిలో గోడప్రతులను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 3: హైదరాబాద్ లా ల్‌బహదూర్ స్టేడియం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ఈనెల 7వ తేదీన నిర్వహించబోయే 'లక్ష డప్పులు – వేల గొంతుకలు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎల్లారెడ్డి ఎమ్మార్పీఎస్ నాయకుడు కంతి పద్మారావు పిలుపునిచ్చారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు గోడ ప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమానికి మండలంలోని ప్రతి గ్రామం నుంచి మాదిగలు డప్పులతో పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకులు శివానందం, పోచయ్య, నరేశ్, రాజు, కిష్టయ్య, సాయిబాబా, సాయిలు ఉన్నారు.